మధ్యాహ్నం మంచు దుప్పట్లో...



ఉదయం పూట శీతాకాలంలో మంచు కురవడం సాధారణం. అయితే ముందస్తు నైరుతి రుతుపవనాల ప్రవేశంతో రాష్ట్రంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీనికి ఉదాహరణే సేలం జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఏర్కాడును మంగళవారం మధ్యాహ్నం మంచు కమ్మేసింది. దీంతో పర్యాటకులు వింత అనుభూతిని పొందారు.

థ్యాంక్స్ సీఎం సార్

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్, పంజాబ్ రాష్ట్రాల నుంచి క్షేమంగా తిరిగొచ్చిన రాష్ట్ర విద్యార్థులు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కశ్మీర్ పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి దారుణంగా హతమార్చిన నేపథ్యంలో, ఉగ్రదాడిని వ్యతిరేకిస్తూ భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి,పీఓకే, పాకిస్తాన్‌లోని తీవ్రవాదుల నివాసాలపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో పాకిస్తాన్ తన వక్రబుద్ధిని చూపుతూ సరిహద్దుల్లోని ప్రజల నివాసాలపై డ్రోన్లు, బాంబులతో దాడికి యత్నించింది. ఈ నేపథ్యంలో జమ్ముకశ్మీర్, పంజాబ్ రాష్ట్రాల్లో వ్యవసాయం, ఉద్యానవన,మత్స్య, పట్టు గూళ్ల పెంపకం కోర్సులు, ఎన్ఐఎఫ్‌టీ, ఎన్ఐటీ తదితర ఉన్నత విద్య కళాశాలల్లో చదువుకుంటున్న రాష్ట్రానికి చెందిన 242 మంది విద్యార్థినీ, విద్యార్థులు అక్కడే చిక్కుకుపోయారు. రాష్ట్ర విద్యార్థులను సురక్షితంగా తీసుకొచ్చేలా ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రత్యేక విమానంలో విద్యార్థులు డిల్లీలోని తమిళనాడు హౌస్‌కు చేరుకుని, అక్కడి నుంచి రాష్ట్రానికి తిరిగొచ్చారు. ఈ నేపథ్యంలో, జమ్ముకశ్మీర్, పంజాబ్ రాష్ట్రాల నుంచి క్షేమంగా తిరిగొచ్చిన విద్యార్థులు మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమం, ప్రవాస తమిళుల సంక్షేమ శాఖ మంత్రి ఎస్ఎం నాజర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం తదితరులు ఉన్నారు.



సీఎంతో జమ్మూ నుంచి ఇళ్లకు క్షేమంగా చేరిన విద్యార్థులు

రూ.527.84 కోట్లతో 4,978 గృహాలు

- ప్రారంభించిన సీఎం స్టాలిన్



క్వీన్‌మేరీస్ కళాశాల హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న సీఎం



ప్యారీస్, మే 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు పట్టణ నివాస అభివృద్ధి సంస్థ (టీఎన్‌యూహెచ్‌డీబీ) ఆధ్వర్యంలో రూ.527.84 కోట్లతో నిర్మించిన 4,978 గృహాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. రాష్ట్రంలో సొంత ఇళ్లు లేకుండా పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలు లబ్ధిపొందే విధంగా 1970వ సంవత్సరం అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి తమిళనాడు స్లమ్ క్లియరెన్స్ బోర్డు (టీఎన్ఎస్‌సీబీ) ప్రారంభించారు. ఈ సంస్థ సహకారంతో టీఎన్‌యూహెచ్‌డీబీ పలు జిల్లాల్లో కొత్త గృహ సముదాయ భవనాలను నిర్మిస్తోంది. ఈక్రమంలో స్థానిక కైలాసపురంలో రూ.63.34 కోట్ల తో 392 గృహ సముదాయం, కాంచీపురం జిల్లా సాలమంగళంలో రూ.51.05 కోట్లతో నిర్మించిన 400 గృహ సముదాయం సహా రూ.527.84 కోట్లతో నిర్మించిన 4,978 గృహాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించినట్లు సచివాలయం పేర్కొంది. డీఎంకే ప్రభుత్వం అధికారం చేపట్టిన 2021 మే నుంచి ఇప్పటివరకు టీఎన్‌యూహెచ్‌డీబీ ఆధ్వర్యంలో 152 ప్రాంతాల్లో రూ.5,946.42 కోట్లతో నిర్మించిన 52,397 బహుళ అంతస్థు భవనాలలోని గృహాలను ఇళ్లులేని పేద, మధ్య తరగతి ప్రజలకు కేటాయించడం గమనార్హం. అదేవిధంగా టీఎన్ఎస్‌సీబీ ఆధ్వర్యంలో రూ.773.64 కోట్లతో నిర్మించిన 3,113 గృహాలను ప్రభుత్వ ఉద్యోగులకు అద్దె కింద కేటాయించారు. వీటితో పాటు ఆధునిక వసతులతో రూ.117.17 కోట్లతో 10 వాణిజ్య సముదాయ భవనాలు, రూ.67.37 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలు కూడా సీఎం ప్రారంభించారు.రాజధాని నగరం నెర్కుంద్రంలో రూ.25.27 కోట్లతో నిర్మించిన వాణిజ్య కాంప్లెక్స్, సీఐటీ నగర్‌లో రూ.67.60 కోట్లతో నిర్మించిన వాణిజ్య ప్రాంగణం, మదురై జిల్లా తోపూరులో రూ.51.77 లక్షలతో నిర్మించిన వాణిజ్య సముదాయాల ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రులు ఎస్.ముత్తుస్వామి, టీఎం అన్బరసన్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రూ.42 కోట్లతో క్వీన్ మేరీస్ కళాశాల హాస్టల్ భవనం

2022లో ఇచ్చిన హామీ మేరకు నగరంలోని క్వీన్‌మేరీస్ కళాశాలకు రూ.42 కోట్లతో అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన హాస్టల్ భవనాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ మంగళవారం లాంచనంగా ప్రారంభించారు. అనంతరం కళాశాల విద్యార్థినులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ముత్తుస్వామి, కోవి చెళియన్, ఎంపీలు తమిళచ్చి తంగపాండ్యన్, పి.విల్సన్, ఎమ్మెల్యే పి.వేలు తదితరులు కూడా పాల్గొన్నారు.

16 విమానాల రాకపోకల ఆలస్యం

ప్యారీస్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. జాతీయ, అంతర్జాతీయ విమానాశ్రయాలు ఉన్న త్రిశూలంలో వర్షంతో పాటు గాలులు తోడుకావడంతో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం ఉదయం పలు ప్రాంతాల నుండి నగరానికి వచ్చిన 10కి పైగా విమానాలు రన్‌వే పై వర్షపు నీరు నిలిచివుండటంతో ల్యాండింగ్ కాలేక, గంటకు పైగాల్లోనే చక్కర్లు కొట్టాయి. అదేవిధంగా వాతావరణం అనుకూలించకపోవడంతో ఇక్కడినుండి పలు ప్రాంతాలకు 6 విమానాలు ఆలస్యంగా బయలుదేరాయి. వాతావరణంలో మార్పుల కారణంగా చెన్నైలో సోమవారం రాత్రి నుండి తేలికపాటి జల్లులతో పాటు అప్పుడప్పుడు భారీ వర్షం కురుస్తోంది. ఈదురు గాలుల వేగం పెరగడంతో తీరప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విమానాల రాకపోకల ఆలస్యం వల్ల ప్రయాణికులు ఇబ్బందుల పాలయ్యారు.



ఛార్జీలు పెరగవు

- విద్యుత్ శాఖ మంత్రి శివశంకర్

ప్యారీస్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెరగబోవని రవాణా, విద్యుత్‌శాఖల మంత్రి శివశంకర్ స్పష్టం చేశారు. గత కొన్ని రోజులుగా సోషల్‌మీడియాలో జూలై 1 నుంచి పెంచిన విద్యుత్ ఛార్జీలు అమల్లోని రానున్నట్లు ప్రసారమైన కథనాల ఆధారంగా ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే సహా సీపీఐ, సీపీఎం, పీఎంకే, బీజేపీ, టీఎంసీ నేతలు విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయం సరికాదంటూ వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేసిన విషయం తెలిసింది. ఈ నేపథ్యంలో, విద్యుత్ ఛార్జీల పెంపుపై ఎలాంటి జీవో విడుదల చేయలేదని మంత్రి పేర్కొన్నారు. అయినప్పటికీ టీఎన్ఈబీ ఇటీవల విద్యుత్ ఛార్జీల పెంపు పట్టికను విడుదల చేయడంవల్ల విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఆర్థిక నష్టం కలగదన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపుపై ఇంకా అధికారపూర్వకంగా ఎలాంటి ప్రకటన చేయలేదని మంత్రి శివశంకర్ స్పష్టం చేశారు.



క్వారీలో రాళ్ల కింద చిక్కుకుని ఐదుగురి మృతి

- మృతుల కుటుంబాలకు తలా రూ.30 లక్షల పరిహారం



ఐదుగురిని బలిగొన్న క్వారీ

పెరంబూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా సింగంపునరి సమీపంలోని మలాంకోట సమీపంలో క్వారీ బండ కింద చిక్కుకున్న ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. 'మెగా మెటల్ క్వారీ'లో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన సుమారు 50 మంది దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. క్వారీలో సుమారు 450 అడుగుల లోపలకు దిగి రాళ్లు తీస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పనులకు వచ్చిన పదిమంది కార్మికులు రాళ్లు పగులగొట్టే పనిలో నిమగ్నమయ్యారు. ముందుగా క్వారీలో రాళ్లను పగులగొట్టేందుకు పేలుడు పదార్థాలు ఉంచారు. అయితే అవి అనుకున్న సమాయానికి కంటే ముందే పెద్ద శబ్దంతో పేలాయి. ఆ సమయంలో దిగువ భాగంలో పని చేస్తున్న కార్మికులపై రాళ్లు, మట్టిపెళ్లలు పడ్డాయి. ఈ ఘటనలో రాళ్ల కింద చిక్కుకున్న ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. అలాగే గాయపడ్డ మరో ఇద్దరిని సహ కార్మికులు వెలుపలికి తీసి శివగంగ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కానీ అక్కడ చికిత్స ఫలించక ఆ ఇద్దరూ మృతి చెందారు. మృతులను గణేష్, మురుగానందం, ఆర్ముగం, ఆర్జిత్, ఆండిస్వామిగా గుర్తించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా ఈ ఘటనలో మరికొందరు గాయపడినట్లు సమాచారం. కాగా, మృతిచెందిన వారి కుటుంబాలకు తలా రూ.30 లక్షలు అందించనున్నట్లు క్వారీ యాజమాన్యం ప్రకటించింది.

సీఎం దిగ్భ్రాంతి

క్వారీ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తలా రూ.4 లక్షలు, క్షతగాత్రులకు తలా రూ.లక్ష నష్టపరిహారంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

3న పళని ఆలయంలో వైకాశి విశాఖ ఉత్సవాలు ప్రారంభం



ప్యారీస్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శివపార్వతుల పుత్రుడు సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరు ప్రధాన క్షేత్రాల్లో మూడవదిగా పేరొందిన దిండుగల్ జిల్లా పళని దండాయుధపాణి స్వామి ఆలయంలో జూన్ 3న వైకాశి విశాఖ ఉత్సవాలు ధ్వజారోహణం పూజలతో ప్రారంభమవుతాయి. 10 రోజుల పాటు కొనసాగనున్న ఈ ఉత్సవాల్లో ప్రతిరోజు శ్రీవళ్లీ, దేవసేన సమేత ముత్తుకుమారస్వామి పల్లకీ, సహా వివిధ వాహనాల్లో ఆలయ మాడవీధుల్లో ఊరేగిస్తారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామివారి తిరుకల్యాణం జూన్ 7వ తేదీ సాయంత్ర 7గంటలకు నిర్వహించనున్నారు. 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు రథోత్సవం జరుగుతుంది. ఈ పదిరోజులు ఆలయ ప్రాంగణంలో పెరియనాయగి, దండాయుధపాణిస్వామివార్లను విలువైన బంగారు ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో విశేషంగా అలకరించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మరోవైపు భక్తులను ఆకట్టుకునేలా ఆధ్యాత్మిక ప్రసంగాలు, భక్తిసంగీత విభావరి, భరతనాట్యం, జానపద కళాకారుల ప్రదర్శన ఉంటాయని పళని ఆలయ అధికారి మారిముత్తు తెలిపారు.

ప్రైవేటు బస్సుల్లో ఛార్జీల మోత

- నాలుగు రెట్ల పెంపుతో బెంబేలెత్తుతున్న జనం



అడయార్, మే 20 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగియనుండడంతో తిరుగు ప్రయాణాలు పెరిగాయి. దీన్ని అవకాశంగా తీసుకున్న ప్రైవేటు బస్సు యజమానులు ఛార్జీలను ఏకంగా నాలుగు రెట్లు పెంచేశారు. ఇతర జిల్లాల నుంచి చెన్నైకు పలు పనుల నిమిత్తం వచ్చే వారు ప్రభుత్వ బస్సులు అందుబాటులో లేని సమయంలో ఆమ్నీలను ఆశ్రయిస్తుంటారు. పండుగల సమయాలు, వారాంతపు సెలవుల్లో కూడా ఇదే పరిస్థితి. దీంతో ప్రైవేటు బస్సు యజమానులు ఛార్జీలను ఇష్టానుసారంగా పెంచేస్తుంటారు. ఈ నేపథ్యంలో వేసవి సెలవులు ముగియనుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలతో తిరిగి తాము విధులు నిర్వహించే ప్రాంతలకు వెళుతున్నారు. చెన్నై నుంచి మదురైకు స్లీపర్ బస్సులో రూ.500 నుంచి రూ.700 వసూలు చేస్తుండగా ప్రస్తుతం ఈ ప్రయాణ చార్జీని రూ.1300 నుంచి రూ.3200కు పెంచేశారు. అలాగే, చెన్నై నుంచి కోయంబత్తూరుకు రూ.800గా ఉంటే ఇపుడు ఇది రూ.3650కు పెంచారు. తిరునెల్వేలి, నాగర్ కోయిల్ ప్రాంతాలకు రూ.900గా ఉంటే ఇపుడు రూ.2500 నుంచి రూ.3500గా వసూలు చేస్తున్నారు. విరుదునగర్‌కు రూ.700గా ఉంటే ఇపుడు రూ.2800 నుంచి రూ.3200గాను, రామనాథపురానికి రూ.800గా ఉంటే ఇపుడు రూ.2000 నుంచి రూ.2800గాను, ఈరోడ్‌కు రూ.900గా ఉంటే రూ.1900 నుంచి రూ.2550గాను వసూలు చేస్తున్నారు. ఈ ప్రయాణ ఛార్జీలు ఈ నెలాఖరు లేదా జూన్ మొదటి వారంలో మరింతగా పెరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు బస్సు యజమానులు ఇష్టానుసారంగా బస్సు ఛార్జీలను పెంచడంపై రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అడయార్ నదీతీరంలో ఆక్రమణల తొలగింపు

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లావరం సమీపంలోని అనకాపుత్తూర్ అడయార్ నదీతీరంలో ఆక్రమణల తొలగింపు ఉద్రిక్తతకు దారి తీసింది. అడయార్ నదీ తీరంలోని తాయ్ మూకాంబిగై నగర్, ఖాయిదేమిల్లత్ నగర్, శాంతినగర్, ఎంజీఆర్ నగర్ 3వ వీధి తదితర ప్రాంతాల్లో సుమారు 600కు పైగా ఇళ్లు నది తీరాన్ని ఆక్రమించి నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. తొలివిడతగా ఆ ప్రాంతంలో నివసిస్తున్న 80 కుటుంబాలకు తమిళనాడు హౌసింగ్ బోర్డు నిర్మించిన ఇళ్లు కేటాయించారు. మిగిలిన ఇళ్లు తొలగించేందుకు ఈనెల 14న చర్యలు చేపట్టగా, స్థానికులు అడ్డుకున్నారు. మంగళవారం ఉదయం చెంగల్పట్టు జిల్లా రెవెన్యూ అధికారి అరుళ్ సిబ్బందితో వెళ్లి స్థానికులతో చర్చించడంతో 20 కుటుంబాల వారు అక్కడి నుంచి వెళ్లేందుకు అంగీకరించారు. దీంతో, వారి ఇళ్లను ఎక్స్‌కవేటర్లతో తొలగించారు. అయితే అన్నాడీఎంకే, డీఎండీకే, నామ్ తమిళర్ పార్టీల నేతలు అక్కడకు చేరుకుని బాధితులకు మద్దతుగా ఆందోళన చేపట్టారు. అధికారులు నచ్చచెప్పి పంపేశారు.



ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణల తొలగింపు

23న తంజావూరులో అన్నాడీఎంకే ధర్నా : ఈపీఎస్



ప్యారీస్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపు చర్యలను ఖండిస్తూ ఈనెల 23న తంజావూరులో ధర్నా చేపట్టనున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. తంజావూరు జిల్లాలోని కుంభకోణంలో ఉన్న తిరువిడైమరుదూర్‌లో అత్యాచారానికి గురైన యువతికి న్యాయం జరగాలని, ఈ దుశ్చర్యలకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, రాష్ట్రవ్యాప్తం మహిళలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న లైంగిక వేధింపులను అడ్డుకోవడంలో విఫలమైన డీఎంకే ప్రభుత్వాన్ని ఖండిస్తూ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు తంజావూరు బస్టాండు ఆవరణలో ధర్నా నిర్వహించనున్న తెలిపారు. మాజీమంత్రి ఆర్.బి.ఉదయ్‌కుమార్ నేతృత్వంలో జరగనున్న ఈ ధర్నాలో ఎంజీఆర్ యువజన విభాగం, మహిళా విభాగం, న్యాయవాదుల విభాగం, విద్యార్థి విభాగాల కార్యకర్తలు పాల్గొంటారని ఈపీఎస్ తెలిపారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, మే 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా పోరూర్ పరిధిలోని ముత్తు నగర్, ఎమ్మార్కే నగర్, ముగలివాక్కం మెయిన్ రోడ్డు, లలిత నగర్, ఈవీపీ సంతోష్ నగర్, ముత్తు నగర్, కృష్ణా నగర్, బంగ్లాతోపు, మాతా నగర్ మెయిన్ రోడ్డు, పూనియమ్మాన్ ఆలయ వీధి ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాకు ఉండదని విద్యుత్ బోర్డు పేర్కొంది. ● ఆవడి ప్రాంతంలోని చెక్‌పోస్ట్, ఎన్ఎం రోడ్డు, నందవన మెట్టూరు, కన్నికాపురం, తిరుమల రాజాపురం, హిందూ కాలేజ్, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు టీఎన్‌ఈబీ ఓ ప్రకటనలో తెలిపింది.

బోధనేతర సిబ్బంది పనివేళల మార్పు

పెరంబూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, పాఠశాల విద్యాశాఖ కార్యాలయాల్లో పనిచేసే జూనియర్ అసిస్టెంట్, అసిస్టెంట్ తదితర బోధనేతర సిబ్బంది పని వేళలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటలుగా నిర్ణయించారు. 2023లో బోధనేతర సిబ్బంది పని వేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు మార్పు చేశారు. ఈ మార్పుపై పలు సంఘాలు అభ్యంతర వ్యక్తం చేశాయి. ఈ క్రమంలో, బోధనేతర సిబ్బంది పనివేళల మార్పును సమీక్షించి ఈ మేరకు మార్పు చేసింది. పనివేళలు ముగిసిన తర్వాత అత్యవసర పనులకు సిబ్బంది సహకరించాలని, సెలవు రోజుల్లో షిఫ్టు పద్ధతిలో పనిచేసేందుకు కార్యాలయ అధికారులు నిర్ణయిస్తారని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది.

గిండీలో ట్రాఫిక్ మార్పులు

పెరంబూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా స్థానిక గిండి గాంధీ మండపం ప్రాంతంలో చేపట్టిన ట్రాఫిక్ మార్పులు మంగళవారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఆ ప్రకారం, రాజ్ భవన్ నుంచి సర్దార్ పటేల్ రోడ్డు మీదుగా మధ్య కైలాష్ వైపునకు వెళ్లే వాహనాలు గాంధీ మండపం (ఐబిటీ) ఫ్లైఓవర్ మీదుగా మాత్రమే వెళ్లాలి. గాంధీ మండపం సర్వీస్ రోడ్డులో ప్రవేశించే వాహనాలు గాంధీ మండపం జంక్షన్‌లో ఎడమ వైపు తిరిగి వెళ్లాలి. సీఎల్ఆర్ఐ బస్టాప్ ప్రస్తుతమున్న ప్రాంతం నుంచి కొంచెం ముందుకు మార్చినట్లు నగర ట్రాఫిక్ విభాగం తెలిపింది.

ప్రభుత్వ కళాశాలల్లో చేరేందుకు 1.61 లక్షల దరఖాస్తులు

పెరంబూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో చేరేందుకు 13 రోజుల్లో 1.61 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల అడ్మిషన్లకు దరఖాస్తు స్వీకరణ ఈ నెల 7న ప్రారంభమైంది. ఈ నెల 19న సోమవారం సాయంత్రం వరకు 46,691 మంది విద్యార్థులు, 75,959 మంది విద్యార్థినులు, 48 మంది హిజ్రాలు దరఖాస్తు చేసుకున్నారు. 1,22,698 మంది దరఖాస్తు రుసుము చెల్లించారు. విద్యార్థులు www.tngasa.in లో ఈనెల 27వ తేదిలోపు దరఖాస్తు సమర్పించవచ్చు.వివరాలకు నెం.044-24342911లో కానీ, dce-offecehelpdesk@gmail.comలో సంప్రదించవచ్చని ఉన్నతవిద్యాశాఖ మంత్రి చెళియన్ తెలిపారు.

పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడులు, గిరిజనులు, క్రైస్తవ ఆదిద్రావిడుల విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ సహా పలురకాల ఉపకారవేతనాలు అందిస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్ నెంబరు అనుసంధానం చేసిన బ్యాంక్ ఖాతాలో నగదు జమచేయనున్నారు. ఆ ప్రకారం, 2024-25 విద్యాసంవత్సరానికి స్కాలర్‌షిప్ కోసం అనే https://umis.tn.gov.in/లో ఈనెల 30వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

రేపటినుంచి సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తులు

పెరంబూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్లస్ వన్, టెన్త్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు జూలై 4 నుంచి 11వ తేది వరకు జరుగనున్నాయి. విద్యార్థులు తాము చదివిన కళాశాలలు, ప్రైవేటు విద్యార్థులు ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ పరీక్షల సేవా కేంద్రాల్లో జూన్ 4వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలి. పరీక్ష ఫీజు, ఆన్‌లైన్ ఫీజు తదితరాలను నగదు రూపంలోనే చెల్లించాలి. నిర్ణీత తేదిలోపు దరఖాస్తు చేసుకోలేని విద్యార్థులు, 'తత్కాల్' విధానంలో జూన్ 5, 6 తేదీల్లో ప్రత్యేక ఫీజుగా టెన్త్‌కు రూ.500, ప్లస్ వన్ తరగతికి రూ.1,000 చెల్లించాలి. సప్లిమెంటరీ పరీక్షల టైంటేబుల్, ప్రభుత్వ పరీక్షా సేవా కేంద్రాల వివరాలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం తదితరాలను www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు తెలుసుకోవచ్చని ప్రభుత్వ పరీక్ష శాఖ తెలియజేసింది.

కాట్పాడి మీదుగా విజయవాడకు వందేభారత్

ప్యారీస్, మే 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడ - బెంగుళూరు మధ్య కొత్తగా ప్రారంభించనున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వేలూరు జిల్లా కాట్పాడి రైల్వేస్టేషన్‌లో ఆగి వెళ్తుందని దక్షిణ రైల్వేశాఖ ప్రకటించింది. విజయవాడ నుంచి తిరుపతికి వెళ్లే శ్రీవారి భక్తుల కోసం, బెంగుళూరుకు వెళ్లే ప్రజలకు ఈ రైలు ప్రయోజనకరంగా వుంటుంది. మొత్తం 8 బోగీలతో వారంలో మంగళవారం మినహా మిగతా రోజుల్లో నడిపే ఈ రైలు విజయవాడ నుంచి ఉదయం 5.15 గంటలకు బయలుదేరి కాట్పాడికి ఉదయం 11.13 గంటలకు చేరుతుంది. మరో మార్గంలో బెంగుళూరు నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు విజయవాడకు బయలుదేరే ఈ రైలు సాయంత్రం 5.23 గంటలకు కాట్పాడికి చేరుకుంటుంది.

చెన్నై హార్బర్‌లో లారీ యజమానుల సమ్మె

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక హార్బర్‌లో కంటైనర్ లారీలకు రూ.100 పార్కింగ్ రుసుము వసూలు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం నుంచి లారీ యజమానులు సమ్మె చేపట్టారు. హార్బర్ యాజమాన్యం ఈనెల 14న విడుదల చేసిన ప్రకటనలో... కంటైనర్ లారీ పార్కింగ్‌కు రూ.100 వసూలు చేయనున్నట్టు పేర్కొంది. ఈ ప్రకటనను వ్యతిరేకిస్తూ కంటైనర్ లారీల యజమానుల సంఘం, డ్రైవర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి మూడు రోజులు సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటించారు. అప్పటికీ యాజమాన్యం తన ప్రకటన ఉపసంహరించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మె కారణంగా సుమారు 4,500 లారీలు నిలిచిపోయాయి.

మృతుడి వేలిముద్రలు ఆధార్‌తో పోల్చలేం

● హైకోర్టుకు తెలిపిన కేంద్రప్రభుత్వం

పెరంబూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): మరణించిన వ్యక్తి వేలిముద్రలను ఆధార్ డేటాతో పోల్చడం అసాధ్యమని కేంద్రప్రభుత్వం మద్రాసు హైకోర్టుకు తెలిపింది. మృతి చెందిన వ్యక్తిని గుర్తించేందుకు వేలిముద్రల ద్వారా సమాచారం కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అందుకు 'యూఐడీఏఐ' సంస్థకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టు ఉత్తర్వులతో కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన కేంద్ర ప్రభుత్వం... మరణించిన వ్యక్తి వేలిముద్రలను ఆధార్ డేటా పోల్చడం అసాధ్యమని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ వివరణ అనంతరం తదుపరి విచారణ జూన్ 12వ తేదీకి వాయిదా వేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

సిరువాపురి ఆలయ అన్నదానం పథకం విస్తరణ

పెరంబూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా సిరువాపురి మురుగన్ ఆలయంలో అన్నదానం పథకాన్ని విస్తరించారు. ఆ ప్రకారం, మంగళవారం 500 మందికి అన్నదానం చేస్తుండగా, ఇక నుంచి 2,000 మందికి పెంచారు. అలాగే, ఆదివారాల్లో 100 మందిని అందించే పథకాన్ని 500కు విస్తరించారు. ఈ పథకాన్ని పొన్నేరి ఎమ్మెల్యే దురై చంద్రశేఖర్ మంగళవారం ప్రారంభించారు.

ప్రారంభం రోజే పాఠ్యపుస్తకాల పంపిణీ

● పాఠశాల విద్యాశాఖ

ప్యారీస్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు ప్రారంభమయ్యే రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. రాష్ట్రంలో ఏప్రిల్ 25వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. జూన్ 2న పాఠశాలల పునఃప్రారంభం ఉంటుందని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. ఈ నేపథ్యంలో, 2025-26వ విద్యాసంవత్సరానికి అవసరమైన పాఠ్యపుస్తకాల ముద్రింపు పనులను 90శాతం పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలలకు సరఫరా చేసే చర్యలు చేపట్టారు.

రెడ్‌క్రాస్ జనార్దన్ సేవలు ప్రశంసనీయం



రెడ్‌క్రాస్ అధ్యక్షుడు జనార్దన్‌కు తిరుక్కురల్ పుస్తకాన్ని బహూకరిస్తున్న లండన్ తమిళ సంఘం నిర్వాహకులు

వేలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడిలోని రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ సేవలు అభినందనీయమని లండన్ ఈస్ట్ తమిళ సంఘం నిర్వాహకులు కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కరోనా లాక్‌డౌన్ సమయంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల ప్రశంసలందుకున్నారన్నారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సత్కరించి, జనార్దన్‌కు తిరుక్కురల్ పుస్తకాన్ని బహూకరించారు.

పోలీస్ గ్రీవెన్స్‌లో 62 వినతులు



సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

పెరంబూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం పోలీసు గ్రీవెన్స్ జరిగింది. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, పోలీసులు పాల్గొని బదిలీ, క్వార్టర్స్ కేటాయింపు, వేతనం తగ్గింపు సహా పలు సమస్యలపై 62 వినతిపత్రాలు అందజేశారు. వినతిపత్రాలు పరిశీలించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించినట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

25న డీఎంకే యువజన విభాగం సమావేశం

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): డీఎంకే యువజన విభాగం ఆర్గనైజర్లు, డిప్యూటీ ఆర్గనైజర్ల సమావేశం ఈ నెల 25వ తేది జరగనుంది. ఈ మేరకు ఆ విభాగం కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... తిరుచ్చిలో 25వ తేది ఉదయం 9 గంటలకు జరిగే సమావేశానికి డిప్యూటీ కార్యదర్శి ఎస్.జోయల్, ఇన్బా ఏఎన్ రఘు, ఎన్.ఇళయరాజా, ఎంపీ కేతు ప్రకాష్ తదితర నేతృత్వంలో సమావేశం జరుగనుందని పేర్కొన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి జయంతి వేడుకలు, యువజన విభాగం చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించనున్నారు.

భర్తను హతమార్చిన మహిళ అరెస్ట్

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఘర్షణకు దిగిన భర్తను హతమార్చిన మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. నీలగిరి జిల్లా మసినగుడి సమీపం సాయినగర్‌కు చెందిన దినేష్‌కుమార్(35) దినసరి కూలి. సాయంత్రం మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. మద్యం తాగొద్దని భార్య కార్తియాయిని (34) పలుమార్లు చెప్పింది. ఘటన జరిగిన రోజున మద్యం తాగి ఇంటికొచ్చిన దినేష్‌కుమార్ భార్యతో ఘర్షణకు దిగాడు. అతని వేధింపులు తట్టుకోలేని ఆమె, కత్తితో గొంతు కోసి హతమార్చింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, కార్తియాయిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

వేలూరులో టీవీకే రెండో బూత్ కమిటీ మహానాడు

● హీరో విజయ్ సన్నాహాలు

అడయార్, మే 20 (ఆంధ్రజ్యోతి): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా హీరో విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగం అడుగులు వేస్తోంది. వివిధ రకాలైన కార్యక్రమాలను చేపడుతోంది. ఇటీవల ఆ పార్టీ బూత్ కమిటీ మహానాడును నిర్వహించింది. ఇప్పుడు రెండో మహానాడును వేలూరులో నిర్వహించాలని భావిస్తోంది. ఇందులో వేలూరు, రాణిపేట, తిరుణ్ణామలై, తిరుపత్తూరు, కడలూరు, కృష్ణగిరితో పాటు మొత్తం 20 జిల్లాల బూత్ కమిటీ సభ్యులు పాల్గొనేలా సన్నాహాలు చేస్తున్నారు. రెండు రోజుల పాటు సాగే ఈ మహానాడులో ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. అలాగే, వేలూరు పట్టణంలో రోడ్ షో కూడా నిర్వహించనున్నట్లు సమాచారం. అయితే, మహానాడు జరిగే తేదీలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. ఆ తర్వాత పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, ఇతర నిర్వాహకులు ఈ మహానాడు ఏర్పాట్లు పనులు ప్రారంభించనున్నారు.

దివ్యాంగులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

● ఎన్నికల అధికారులతో కలెక్టర్ సుబ్బులక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): 2026లో రానున్న శాసనసభ ఎన్నికలకు పూర్తిస్థాయిలో దివ్యాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకోనేలా చర్యలు చేపట్టాలని ఎన్నికల అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ఎన్నికలకు ముందుగానే దివ్యాంగుల వివరాలను గుర్తించే విధంగా డిస్ట్రిక్ట్ మోనిటరింగ్ కమిటీ ఆన్ యాక్సెసబుల్ ఎలక్షన్ (డీఎంసీఏఈ) సభ్యులు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని ఆమె తెలిపారు. వీరు వికలాంగుల పేర్లు, వారి ఓటర్ జాబితాలో వారి బూత్ వివరాల ఆధారంగా దివ్యాంగ ప్రజలు ఓటింగ్ కేంద్రాలకు రాకుండానే వారి ఇంటివద్దకు వెళ్ళి ఓటు వినియోగించుకునేలా చర్యలు చేపట్టనున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ జానకీ రవీంద్రన్, తహసీల్దార్ సెందిల్‌కుమార్, కలెక్టర్ పీఏ ముత్తరసన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కళాశాల భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన పూజల్లో కలెక్టర్ తదితరులు

వేలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వేలూరు పెరియార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ నూతన భవన నిర్మాణాల పూజ కార్యక్రమంలో వేలూరు కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రూ.5.28 కోట్లతో చేపట్టిన పనుల్లో గదులు, 2 సైన్స్ ల్యాబ్‌లు, మరుగుదొడ్లను నిర్మిస్తున్నటు తెలిపారు. వేలూరులోని మరో ప్రభుత్వ కళాశాలలో కూడా పనులకు శంకుస్థాపన చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ జానకీ రవీంద్రన్, తహసీల్దార్ సెందిల్‌కుమార్, కలెక్టర్ పీఏ ముత్తరసన్, కళాశాల నిర్వాహకులు సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగాల పేరుతో మోసం

● ఇద్దరు మహిళల అరెస్ట్

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ. లక్ష, రూ.2 లక్షలు వసూలు చేసిన ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్ట్ చేశారు. అంగన్‌వాడీలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. తిరుపత్తూర్ జిల్లా ఆలంగాయం, చుట్టుగ్రామాల్లో అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న పలువురిని ఫోన్‌లో సంప్రదించిన గుర్తుతెలియని వ్యక్తులు, తాము జిల్లా కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని, తమకు నగదు ఇస్తే పోస్టులకు ఎంపిక చేస్తామని తెలిపినట్లు సమాచారం. ఈ మేరకు ఇద్దరు మహిళలు సోమవారం ఆటోలో ఆలంగాయం చేరుకున్నారు. పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారితో సమావేశమై, నగదు చెల్లించాలని కోరారు. వారిని అనుమానించిన మహిళలు, వారిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో వారు తిరుపత్తూర్ హౌసింగ్ బోర్డు ప్రాంతంలో అంగన్‌వాడీలో పనిచేస్తున్న రమావతి(46), జోలార్‌పేట పెరియకమ్మియంపట్టులోని అంగన్‌వాడీలో పనిచేస్తున్న జమ్నిక(45) అని తెలిసింది. అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేకరించి, వారిని సంప్రదించి నట్లు తెలిసింది. ఇరువురిని అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

బెంగళూరు హైవేపై స్తంభించిన ట్రాఫిక్

● 12 గంటల పాటు రాకపోకలకు అంతరాయం



ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

వేలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీ మరమ్మతులకు గురై ఆగి పోయింది. దీని కారణంగా సుమారు 5 కిలోమీటర్ల మేరకు వాహనాల స్తంభించాయి. అదేవిధంగా అనైకట్టు తాలూకాలోని పళ్లికొండ లో హైవేపై కూడా ఇదే విధమైన పరిస్థితి నెలకొంది. అనైకట్టులో ప్రభుత్వం రూ.43 కోట్లతో చేపట్టిన రహదారి వంతెన పనుల కారణంగానే ఈ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందని వాహనదారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో, ఆ ప్రాంతాల్లో సుమారు 12 గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

నాటకమాడింది చాలు... నీట్ రద్దు చేయించండి

● ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన రాందాస్

ప్యారీస్, మే 20 (ఆంధ్రజ్యోతి): నాటకాలు ప్రదర్శించకుండా ఇప్పటికైనా నీట్‌ను రద్దు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టాలని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ డిమాండ్ చేశారు. ఇటీవల నీట్‌కు హాజరైన సేలం విద్యార్థి గౌతమ్ ఆ పరీక్షలో ఫెయిల్ అవుతాననే అనుమానంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఏడాది నీట్ భయంతో ఆరుగురు ఆత్మహత్య చేసుకోవడంపై రాందాస్ తన ఎక్స్ ఖాతాలో స్పందించారు. నీట్‌కు హాజరైన విద్యార్థుల్లో పలువురు ఉత్తీర్ణులు కాలేమన్న భయంతో మనశ్శాంతి కోల్పోయి, మానసికంగా బాధపడుతున్నారని, ఇలాంటి మరణాలకు డీఎంకే ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. 2021 ఎన్నికల డీఎంకే మేనిఫెస్టోలోని 500కు పైగా హామీల్లో నీట్ రద్దు ఒకటని, అయితే అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్ళు పూర్తవుతున్నా హామీని నెరవేర్చకుండా విద్యార్థులను మభ్యపెట్టేలా నాటకాలు ఆడుతోందని విమర్శించారు. సీఎం ఇప్పటికైనా నీట్ రద్దు చేసేలా చర్యల తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'నీట్' సరిగా రాయలేదని విద్యార్థి ఆత్మహత్య

పెరంబూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): నీట్ సరిగా రాయలేదంటూ ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సేలం రాజేంద్రపట్టి ఓంశక్తి నగర్‌కు చెందిన రంజన్, యోగలక్ష్మి కుమారుడు గౌతమ్ (20) 2023లో ప్లస్‌టూ ఉత్తీర్ణులయ్యాడు. అనంతరం రెండు సార్లు రాసిన నీట్‌లో ఉత్తీరుడు కాలేదు. మూడో సారిగా గత నెల జరిగిన నీట్ రాశాడు. ఈసారి కూడా తక్కువ మార్కులతో ఫెయిలవుతాయని ఆందోళన చెందిన గౌతమ్, సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న సూరమంగళం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సేలం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విషవాయువు సోకి ముగ్గురి మృతి

పెరంబూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): పల్లడం సమీపంలోని అద్దకపు కర్మాగారంలో రంగుల వ్యర్థాల తొట్టి శుభ్రం చేస్తుండగా ముగ్గురు కార్మికులు విషవాయువు సోకి మృతి చెందారు. తిరుప్పూర్ జిల్లా కారైపుదూర్‌లో ప్రైవేటు కర్మాగారంలో వ్యర్థాలు వేసేందుకు ఏర్పాటు చేసిన 7 అడుగుల లోతున్న తొట్టిను శుభ్రం చేసేందుకు నలుగురు కార్మికులు లోపలికి దిగారు. ఊహించని విధంగా తొట్టి నుంచి విషవాయువు సోకడంతో నలుగురు స్పృహతప్పి పడిపోయారు. కర్మాగారం కార్మికులు వారు వారిని వెంటనే తిరుప్పూర్ పల్లడం రోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు ఫలించక సుండమేట్టై ప్రాంతానికి చెందిన శరవణన్(30), వేణుగోపాల్(31) సోమవారం రాత్రి మృతిచెందారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న హరికృష్ణన్(20) మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గోడ కూలి ముగ్గురి మృతి



మృతులు వెంకటమ్మ, వీరమణి, అమ్మాపిళ్లై (ఫైల్ ఫొటోలు)

పెరంబూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇంటి గోడ కూలిపడి ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటన మదురై జిల్లాలో సోమవారం రాత్రి జరిగింది. మదురై జిల్లాల్లో సోమవారం సాయంత్రం నుంచి భారీ వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు చేరింది. మదురై వలయంకుళం ప్రాంతంలో వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో, ఆ ప్రాంతానికి చెందిన అమ్మాపిళ్లై (65), పక్కింటికి చెందిన వెంకటమ్మ (55)తో ఇంటి ముందు కూర్చుని మాట్లాడుతోంది. వీరితో పాటు అమ్మాపిళ్లై మనవడు వీరమణి (10) కూడా ఉన్నాడు. ఆ సమయంలో ఊహించని విధంగా ఇంటి గోడ కూలింది. గోడ శిథిలాల కింద చిక్కుకుని ముగ్గురు మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని చుట్టుపక్కల వారి సాయంతో మృతదేహాలు వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెట్టును ఢీకొన్న కారు

● ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి



నుజ్జునుజ్జైన కారు - రాజా, జానకి(ఫైల్ ఫొటోలు)

పెరంబూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా గాంగేయం సమీపంలో మంగళవారం తెల్లవారుజామునచింత చెట్టును కారు ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. కేరళ రాష్ట్రం ఇడుక్కి జిల్లా మూనారు ప్రాంతానికి చెందిన రాజా(46) భార్య జానకి(40) ఈరోడ్ జిల్లా అరచ్చలూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ నర్సుగా పనిచేస్తోంది. ఈ దంపతులకు హేమిమిత్ర (15), మౌనా షరీన్ (11) కుమార్తెలున్నారు. వీరు ఆస్పత్రి క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. పదిరోజుల క్రితం కేరళలోని బంధువుల ఇంట శుభకార్యానికి వెళ్లారు. వీరు మంగళవారం వేకువజామున 3 గంటలకు కేరళ నుంచి కారులో అరచ్చనల్లూర్‌కు బయల్దేరారు. గాంగేయం సమీపం నత్తకడయూర్ వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చింత చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో కారు నడుపుతున్న రాజా, భార్య జానకి, పెద్ద కుమార్తె హేమిమిత్ర సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని తీవ్రగాయాలతో ఉన్న రెండో కుమార్తె మౌనాషరీన్‌ను తిరుప్పూర్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించిన పోలీసులు, కేసు దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ తీగలు తగిలి రథం దగ్ధం

● ఒకరి మృతి, నలుగురికి గాయాలు



పెరంబూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): మధురాంతకం సమీపం ఒరత్తి గ్రామంలో జరిగిన ఆలయ వేడుకల్లో విద్యుత్ తీగలు రథానికి తగిలి మంటలు చెలరేగి దగ్ధమైన ఘటనలో యువకుడు మృతిచెందాడు. చెంగల్పట్టు జిల్లా 84 ఒరత్తిలోని ద్రౌపది అమ్మవారి ఆలయ వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి రథోత్సవం నిర్వహించారు. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఊహించని విధంగా రథానికి విద్యుత్ తీగ తగలడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రథం పూర్తిగా దగ్ధం కాగా, రథంపై ఉన్న రామన్ (20) ఘటనా స్థలంలోనే మృతిచెందారు. అలాగే మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వారిని మధురాంతకం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

చిన్నారిపై అత్యాచారం

● మాజీ సైనికుడి అరెస్టు



పురుషోత్తం


వేలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుడు చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన సంఘటన వేలూరు జిల్లాలో వెలుగు చూసింది. వేలూరుకు చెందిన పురుషోత్తం (71) ఆర్మీలో పనిచేసి రిటైర్డ్ అయ్యి ఇంటివద్దనే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో, పక్కింట్లో చిన్నారి తరచూ పురుషోత్తం ఇంట్లో ఆడుకోడానికి వచ్చేది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఆడుకోడానికి ఇంటికి వచ్చిన చిన్నారిపై లైంగికంగా వేధింపులకు పాల్పడ్డాడు. అక్కడినుండి తప్పించుకున్న చిన్నారి తన తల్లిదండ్రులకు జరిగిన విషయం తెలిపింది. దీనిపై వేలూరు మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, రంగంలోకి దిగిన పోలీసులు పురుషోత్తంపై పోక్సో చట్టం కింద అరెస్టు చేసి, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

కారు ప్రమాదంలో గాయని హిజ్రాకి గాయాలు

పెరంబూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్ సమీపంలో డివైడర్‌ను కారు ఢీకొన్న ఘటనలో జానపద గాయనికి గాయాలయ్యాయి. స్థానిక పుదుపేట వెస్ట్ కూవమ్ ప్రాంతానికి చెందిన హిజ్రా విమల, జానపద పాటలు పాడుతూ పేరుగాంచింది. తన స్నేహితులు అరుణ్‌కుమార్, ప్రశాంత్,వసంత్ తదితరులతో కలసి విమల మంగళవారం తెల్లవారుజామున కారులో వెళ్తుండగా, మెరీనా రోడ్డులో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న డివైడర్‌ను ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న నలుగురుకి గాయాలుకాగా, చుట్టుపక్కల వారు రక్షించి రాయపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ట్రిప్లికేన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నగల చోరీ కేసులో నేపాల్ దంపతుల అరెస్ట్

పెరంబూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక తొట్టివాక్కంలో 60 సవర్ల నగల చోరీ కేసులో నేపాల్‌కు చెందిన దంపతులను పోలీసులు అరెస్ట్ చేశారు. తొట్టివాక్కం లక్ష్మణ పెరుమాళ్ వీధికి చెందిన మహేష్‌కుమార్, అలమేలు దంపతులు ఒంటరిగా నివసిస్తుండగా, వారి కుమార్తె ఐశ్వర్య ఇంటి పనులు చేసేందుకు నేపాల్‌కు చెందిన రమేశ్యామ్,బినిత దంపతులను నియమించింది. ఇంటి ప్రాంగణంలోని గదిలో వీరు పిల్లలతో నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఈనెల 14న మహేష్‌కుమార్ దంపతులు ఆలయ వేడుకల్లో పాల్గొని మరుసటిరోజు ఇంటికి రాగా రమేశ్యామ్ కుంటుంబం కనిపించలేదు. అలాగే, ఇంటి వెనుక తలుపులు ధ్వంసం చేసి ఉండడం, బీరువాలో ఉంచిన 60 సవర్ల నగలు కనిపించకపోవడంతో నీలాంగరై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై ఏర్పాటు చేసిన మూడు ప్రత్యేక బృందాలు పొరుగు రాష్ట్రాలు, నేపాల్‌లో తీవ్రంగా గాలించాయి. నేపాల్ పోలీసుల సాయంతో బంధువు ఇంట్లో తలదాచుకున్న రమేశ్యామ్ దంపతులను అరెస్ట్ చేసిన ప్రత్యేక బృందం, వారినుంచి 60 సవర్ల నగలు స్వాధీనం చేసుకున్నారు.



'లాయర్'గా విజయ్ ఆంటోని

విజయ్ ఆంటోని హీరోగా నటించే కొత్త చిత్రానికి 'లాయర్' టైటిల్‌ను ఖరారు చేశారు. గతంలో విజయ్ ఆంటోని నటించిన 'జెంటిల్ ఉమెన్'కి దర్శకత్వం వహించిన జోష్వా సేతురామన్ ఈ కొత్త చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై రూపుదిద్దుకునే ఈ మూవీ ప్రీప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుని షూటింగ్‌కు సిద్ధంగా ఉంది. అలాగే, ఇందులో నటించే నటీనటులు, పనిచేసే సాంకేతిక సభ్యుల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. కాగా, ఈ చిత్రాన్ని న్యాయస్థానం నేపథ్యంలో విభిన్నమైన శైలిలో మంచి కథాబలంతో తెరకెక్కించనున్నట్టు దర్శకుడు వెల్లడించారు. హీరోయిన్ ఎంపికపై దర్శక నిర్మాతలు కసరత్తు చేస్తున్నారు. తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో రూపుదిద్దుకోనుంది.

సినిమాలో 30 ఏళ్లు వైవాహిక బంధంలో 25 ఏళ్లు



సుందర్ సి - ఖుష్బూ

సాధారణంగా చిత్ర పరిశ్రమలో నిలదొక్కుకోవడం చాలా అరుదు. సినీ నేపథ్య ఫ్యామిలీ నుంచి వచ్చినవారే దశాబ్దకాలం పాటు కొనసాగాలంటేనే ఆపసోపాలు పడాల్సి వస్తుంది. అలాంటిది మూడు దశాబ్దాలుగా విజయవంతంగా సినీ కెరీర్‌ను కొనసాగిస్తున్న దర్శకుడు సుందర్ సి. హీరోయిన్ ఖుష్బూను వివాహం చేసుకుని, తమ వైవాహిక బంధంలో 25 సంవత్సరాలు పూర్తి చేశారు. సుందర్ సి దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'మురైమామన్' 1995లో విడుదలైంది.ఇందులో జయం రవి, ఖుష్బూ నటించారు. ఆ తర్వాత అనేక విజయవంతమైన చిత్రాలను రూపొందించారు. ఇటీవల 'అరణ్మనై-4', 'మదగజరాజా', 'గ్యాంగర్స్' వంటి వరుస హిట్ చిత్రాలను అందించారు. ఇప్పుడు నయనతార ప్రధాన పాత్రలో నటించే 'మూక్కుత్తి అమ్మన్-2'ని తెరకెక్కిస్తున్నారు.

23న సందడి చేయనున్న 8 చిత్రాలు



'ఏస్'లో విజయ్ సేతుపతి - రుక్మిణి వసంత్

మరో పది రోజుల్లో వేసవి సెలవులు ముగియనున్నాయి. జూన్ 1నుంచి పాఠశాలలు పునః ప్రారంభమయ్యే అవకాశం ఉంది. దీంతో తమ పిల్లలను పాఠశాలలు, కాలేజీల్లో చేర్చే హడావిడిలో తల్లిదండ్రులు నిమగ్నమైవున్నారు. అందుకే దర్శక నిర్మాతలు తమ చిత్రాలను ఈ వేసవి సెలవులు ముగియకముందే విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల నాలుగో శుక్రవారమైన (మే 23వ తేదీ) ఏకంగా ఎనిమిది చిత్రాలు సిద్ధంగా ఉన్నాయి. విజయ్ సేతుపతి నటించిన 'ఏస్', దివంగత విజయకాంత్ తనయుడు షణ్ముగపాండియన్ నటించిన 'పడైతలైవన్'తో పాటు 'ఆగ మొళి విళిగల్', 'షైయల్', 'తిరుపూర్ కురువి', 'స్కూల్' వంటి మొత్తం 8 చిత్రాలున్నాయి. గత వారం విడుదలైన కొన్ని చిత్రాలకు మాత్రం ప్రేక్షకుల ఆదరణ లభించింది. దీంతో వచ్చే శుక్రవారం విడుదలయ్యే చిత్రాలకు ప్రేక్షకాదారణ ఎలా ఉంటుందోనని ఆసక్తి నెలకొంది. మే 1న విడుదలైన 'టూరిస్ట్ ఫ్యామిలీ' మాత్రం ఈ నెలలో ఇప్పటివరకు విడుదలైన చిత్రాల్లో మెగాబ్లాక్ బస్టర్‌గా నిలవడంతో పాటు ఇప్పటికీ అనేక సెంటర్లలో హౌస్‌ఫుల్ కలెక్షన్లతో ప్రదర్శిస్తుండటంతో నిర్మాతలు ఆనందంగా ఉన్నారు.

రుక్మిణి వసంత్‌కు లక్కీఛాన్స్?



చిత్రజ్యోతి

యంగ్ హీరోయిన్ రుక్మిణి వంసత్‌కు గోల్డెన్ ఛాన్స్ వరించనుంది. స్టార్ దర్శకుడు మణిరత్నం తెరకెక్కించే తదుపరి చిత్రంలో ఆమెను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. కమల్ హీరోగా థగ్‌లైఫ్ చిత్రాన్ని మణిరత్నం రూపొందించారు. జూన్ 5న విడుదలకానుంది. ఈ చిత్రం విడుదలైన తర్వాత అతి తక్కువ సమయంలో మణిరత్నం మరో సినిమాకు సన్నాహాలు చేశారు. ఇందులో నవీన్ పోలిశెట్టి హీరోగా నటించనుండగా, హీరోయిన్‌గా రుక్మిణి వసంత్‌కు అవకాశం ఇచ్చినట్టు సమాచారం. తమిళం, తెలుగు భాషల్లో ఏకకాలంలో రూపుదిద్దుకునే ఈ చిత్రాన్ని 'అలైపాయుదే', 'ఓకే కణ్మణి' తరహాలో తెరకెక్కించనున్నారు. కాగా, రుక్మిణి వసంత్ ప్రస్తుతం విజయ్ సేతుపతి హీరోగా నటించిన 'ఏస్'తో పాటు మురుగదాస్ దర్శకత్వంలో శివకార్తికేయన్ హీరోగా నటించే చిత్రంలో నటిస్తున్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీఐటీ చెన్నై అసోసియేట్ వైస్ ఛాన్సలర్ త్యాగరాజన్, వీఐటీ వర్శిటీ ఉపాధ్యక్షులు సెల్వం, ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ నారాయణస్వామి తదితరులు

ఆరోగ్య పరిశోధన కోసం వీఐటీ- ఎంజీఆర్ వర్శిటీల ఒప్పందం

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): ఏఐ ఆధారిత ఆరోగ్య పరిశోధనల కోసం వీఐటీ విశ్వవిద్యాలయం, ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సహకారం, పరిశోధనలు పెంపొందించడం, పీహెచ్‌డీ పర్యవేక్షణ, పరిశోధన, ప్రాజెక్టుల సమర్పణ, కొత్త సాంకేతిక అభివృద్ధి, పేటెంట్లపై దృష్టి కేంద్రకరించనున్నారు. అలాగే, వీఐటీ, ఎంజీఆర్ వర్శిటీ ఆరోగ్య రంగంలో పరిశోధనలు నిర్వహించడానికి సహకరించుకోనున్నాయి. ఈ విషయమై వీఐటీ ఉపాధ్యక్షుడు సెల్వం మాట్లాడుతూ... ఉన్నత విద్య, పరిశోధనలను దేశాభివృద్ధి, ప్రజారోగ్య లక్ష్యాలతో అనుసంధానించడానికి ఈ అవగాహన ఒప్పందం ప్రతిబింబిస్తుందని తెలిపారు.


చెన్నైలో గైడ్‌హౌస్ సేవల విస్తరణ



ప్రారంభోత్సవంలో మహేంద్ర రావత్ తదితరులు

ప్యారీస్, మే 20 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య, ప్రభుత్వ రంగాలకు సేవలందిస్తున్న ప్రపంచ సలహా, సాంకేతిక నిర్వహణ సంస్థ గైడ్‌హౌస్ తన సేవలను విస్తరింపజేసింది. స్థానిక పోరూర్‌లోని కెప్పెల్‌వన్ పారామౌంట్‌లో ఆధునిక సౌకర్యాలతో సేవలను ప్రారంభించింది.ఆవిష్కరణ, సామర్థ్యం కోసం రూపొందించిన కొత్త క్యాంపస్‌లో నైపుణ్య కలిగిన ప్రతిభావంతులు నిరంతర సేవలందించనున్నారు. గైడ్‌హౌస్ ఇండియా భాగస్వామి, కంట్రీ హెడ్ మహేంద్ర రావత్ సోమవారం సంస్థ సేవల విస్తరణ గురించి మీడియాకు వివరించారు.

కొల్లాపురి అమ్మన్ ఆలయంలో ఘనంగా వైకాశి ఉత్సవాలు



ప్రత్యేక అలంకారంలో కొల్లాపురి అమ్మవారు

తిరుత్తణి, మే 20 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా మీసరాకందపురంలో ప్రసిద్ధి చెందిన కొల్లాపురి అమ్మన్ ఆలయంలో ఉదయం వైకాశి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లవారుజాము 4 గంటల నుంచే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ సహా పలు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి సుమారు గంటసేపు క్యూలైన్లలో వేచి ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ క్రమంలో అమ్మవారికి అభిషేకపూజలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్చారణ, మంగళవాయిద్యాలు, భక్తుల దివ్యనామస్మరణల మధ్య అమ్మవారి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు.

మరుదమలైలో ఏనుగు మృతి



ఏనుగు కళేబరం

వాషర్‌మెన్‌పేట, మే 20 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా మరుదమలై అటవీప్రాంతంలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆడ ఏనుగు మృతి చెందింది. మరుదమలై అటవీ ప్రాంతంలో మూడు రోజుల క్రితం తల్లి ఏనుగు, దాని పక్కనే గున్న ఏనుగు చాలా సేపు ఉండడాన్ని గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు అక్కడకు చేరుకుని ఏనుగును పరిశీలించగా, అది తీవ్ర అనారోగ్యంతో ఉన్నట్లు గుర్తించారు. వెటర్నరీ వైద్యులు ఏనుగును ప్రొక్లయిన్ సాయంతో నిలబెట్టి గ్లూకోజ్ ఇంజక్షన్ల ద్వారా చికిత్స అందించారు. అయినా చికిత్స ఫలించక మంగళవారం సాయంత్రం ఏనుగు మృతి చెందింది.

కుట్రాలం జలపాతంలో స్నానాల నిషేధం



ప్యారీస్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తెన్‌కాశి జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కుట్రాలం జలపాతంలో స్నానాలకు జిల్లా యంత్రాంగం నిషేధం విధించింది. ఇందువల్ల జలపాతంలో సరదాగా స్నానాలు చేసేందుకు వెళ్లిన పర్యాటకులు నిరాశకు గురయ్యారు. నైరుతి రుతుపవనాలు నిర్దేశకాలానికి ముందు రావడం, బంగాళాఖాతంలో అల్పవాయుపీడనం తోడవటంతో రాష్ట్రంలో వాతావరణం చల్లబడింది. గత మూడు నెలలుగా కొనసాగిన మండుటెండలు, అగ్నినక్షత్రం ప్రభావంతో పెరిగిన ఉష్ణోగ్రతలతో తల్లడిల్లిన ప్రజలు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉపశమనం పొందుతున్నారు. ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం ప్రకటన మేరకు మదురై, తిరుచ్చి, కోవై, నీలగిరి, దిండుగల్, తెన్‌కాశి, ధర్మపురి, ఈరోడ్, సేలం, వేలూరు, రాణిపేట, తిరువణ్ణామలై, తిరుపత్తూరు జిల్లాల్లో మంగళవారం సాయంత్రం నుంచి పలు ప్రాంతాల్లో భారీ, కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిశాయి. తెన్‌కాశి జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి జలపాతాలు నిండుకుండలా కనిపిస్తున్నాయి. కొండ నుంచి వేగంగా కిందకి ప్రవహిస్తున్న నీటిలో స్నానమాచరిస్తే ప్రమాదాలు ఏర్పడే అవకాశం ఉండటంతో, ఈ ప్రాంతాల్లోని ఐదు జలపాతాల్లో అధికారులు స్నానాలను నిషేధించారు.

మూడు జిల్లాలకు వరద హెచ్చరిక...

దక్షిణ పెన్నానదిలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా కృష్ణగిరి, తిరువణ్ణామలై, ధర్మపురి జిల్లాలకు వరద హెచ్చరికలు జారీ అయ్యాయి. గత కొన్ని రోజులుగా ఈ మూడు జిల్లాలో భారీగా కురుస్తున్న వర్షాలకు ఆ ప్రాంతంలోని చెరువులు, వాగులు జలకళ సంతరించుకున్నాయి. అదే విధంగా కృష్ణగిరి జిల్లాలో పారుతున్న దక్షిణ పెన్నానదిపై నిర్మించిన కొళవరపల్లి డ్యాం, కృష్ణగిరి డ్యాంలలో భారీగా చేరుతున్న వర్షపు నీటితో ఆనకట్టల్లో నీటిశాతం వేగంగా పెరుగుతోంది. వీటి భద్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా డ్యాంలో చేరుతున్న నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి విడుదల చేసిన నీటితో దక్షిణ పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆ నదీతీర ప్రాంతాల ప్రజలకు జిల్లా యంత్రాంగం వరద హెచ్చరికలు జారీ చేసింది. గట్లపై నిల్చుని సెల్ఫీలు తీసుకోరాదని ఆదేశించింది. అదేవిధంగా ధర్మపురి, తిరువణ్ణామలై జిల్లాల ప్రజలను అప్రమత్తం చేసేలా వరద హెచ్చరికలు జారీ అయ్యాయి.

నేత్రపర్వంగా మహామారియమ్మ రథోత్సవం



రథోత్సవంలో భక్తజనం

ప్యారీస్, మే 20 (ఆంధ్రజ్యోతి): కరూర్ జిల్లా కుళిత్తలైలో ప్రసిద్ధిగాంచిన మహామారియమ్మ రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఈ ఉత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఆలయంలో ఈ నెల 5వ తేదీ ఉదయం స్తంభస్థాపన, సాయంత్రం పూలంగి సేవలతో చిత్తిరై ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు కావేరినదిలో పుణ్యస్నానమాచరించి తీర్థకలశాలతో స్తంభస్థాపన వేడుకల్లో పాల్గొన్నారు. ఉత్సవాల్లో ప్రధానమైన రథోత్సవం మంగళవారం ఉదయం నిర్వహించారు. వందలాది మంది భక్తులు రథం లాగి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధానద్వారం నుంచి బయలుదేరిన రథం ప్రధాన వీధుల మీదుగా సాగగా, భక్తులు రథ చక్రాలపై కల్లుప్పు, మిరియాలను చల్లి, టెంకాయలు కొట్టి, హారతిలిచ్చి స్వాగతం పలికారు.

తాత్కాలిక బస్ డిపోతో విల్లివాక్కంవాసులకు ఇక్కట్లు



ఐసీఎఫ్ పరేడ్ గ్రౌండ్ వద్ద ఏర్పాటైన తాత్కాలిక బస్ డిపో

వాషర్‌మెన్ పేట, మే 20 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు పనుల కారణంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్ డిపోతో విల్లివాక్కంవాసులు ఇబ్బందులు పడుతున్నారు. విల్లివాక్కం బస్ డిపోను ప్రస్తుతం ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరి (ఐసిఎఫ్) పరేడ్ గ్రౌండ్‌కు మార్చారు. ఇది పాత బస్‌డిపో నుంచి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు దాదాపు 40 సర్వీసులు నడుస్తున్నాయి. కొత్త బస్ డిపో మూడు నెలల క్రితం ప్రారంభమైంది. ఇక్కడికి చేరుకునేందుకు స్థానికులు ప్రైవేటు, షేర్ ఆటోలు, మినీ బస్సులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ వసతులు ఏవీ లేనివారు ఒకటిన్నర కిలో మీటర్ల దూరం కాలి నడకన బస్‌డిపోకు చేరుకోవాల్సి వస్తోంది. జీకేఎం కాలనీకి చెందిన 63 ఏళ్ల రాణి మాట్లాడుతూ.. బస్ డిపోకు నడవడానికి అరగంట పడుతోందని ఆయాసపడుతూ చెప్పారు. మండుతున్న ఎండలో నడవడం నరకాన్ని తలపిస్తోందని వాసు అనే ప్రయాణికుడు వాపోయాడు. తన దగ్గర డబ్బులున్నప్పుడు ఆటోలో వెళుతుంటానని, లేనప్పుడు నడిచే వెళుతుంటానని వివరించారు. బస్ డిపో చేరుకునేందుకు ఎస్ 44 మినీ బస్ సర్వీసు ఉన్నప్పటికీ, దాని ఫ్రీక్వెన్సీ చాలా తక్కువగా ఉందని మరో ప్రయాణికుడు తెలిపారు. రాత్రిపూట అంత దూరం నడవడం మహిళలకు ఇబ్బందికరంగా ఉందని అన్నారు. కొలత్తూరుకు చెందిన విద్యార్థిని షిఫాని మాట్లాడుతూ.. బస్ డిపోకు చేరుకునేందుకు ప్రతిరోజు రూ.40 ఖర్చవుతోంద తెలిపారు. వేసవి సెలవులు రావడంతో పిల్లలను బీచ్ తదితర ప్రాంతాలకు తీసుకెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని శ్రీనివాసన్ తెలిపారు. ఇదిలా ఉండగా, మెట్రో రైలు ప్రాజెక్టు కారణంగా బస్ డిపో మార్చాల్సి వచ్చిందని ఎంటీసీ సీనియర్ అధికారి వెల్లడించారు.

సెంట్రల్ మెట్రోలో 10,000 పుస్తకాలతో అతిపెద్ద గ్రంథాలయం



మెట్రో రైల్వే స్టేషన్‌లో ఏర్పాటవుతున్న గ్రంథాలయం

పెరంబూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో రూ.1.85 కోట్లతో 10 వేల పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు కానుంది. పుస్తక పఠనం ప్రోత్సహించేలా ప్రజలు అధికంగా గుమిగూడే ప్రాంతాల్లో పుస్తక పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు చెన్నై మెట్రో రైల్వేస్టేషన్‌లో రూ.1.85 కోట్లతో అతి పెద్ద గ్రంథాలంయ ఏర్పాటుపనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తమిళనాడు పాఠ్యపుస్తకాలు మరియు విద్యా సేవల కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటవుతున్న గ్రంథాలయం త్వరలో ప్రజల అందుబాటులోకి రానుంది. ఈ విషయమై పాఠ్యపుస్తకాల సంస్థ అధికారులు మాట్లాడుతూ... నగరంలో ముఖ్యమైన ప్రాంతాల్లో సెంట్రల్ మెట్రో రైల్వేస్టేషన్ అని, ప్రయాణికులు మాత్రమే కాకుండా ప్రజలు కూడా వినియోగించుకొనేలా గ్రంథాలయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిఘంటువులు, రాజకీయాలు, సాహిత్య, విద్య, తమిళనాడు, భారతీయ, ప్రపంచ చరిత్ర, ఇంగ్లీష్-యూరోపియన్ చరిత్ర, ఉన్నత విద్య పుస్తకాలు, శాస్త్రీయ పుస్తకాలు, పిల్లల పుస్తకాలు, కవిత్వం వంటి పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. తమిళం, ఇంగ్లీషు, తెలుగు సహా దక్షిణ భారత భాషల్లో పుస్తకాలు, ఇంగ్లీషులో అనువాదమైన ప్రపంచ భాషల పుస్తకాలను ఉంచనున్నారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ గ్రంథాలయం పనిచేయనుండగా, పుస్తకాల కొనుగోళ్లపై 10 శాతం రాయితీ అందించనున్నారు. 80 మంది కూర్చొనేలా ఆడిటోరియం, క్యాంటీన్, చిన్న పుస్తకావిష్కరణలు, సాహిత్య కార్యక్రమాలు, వైఫై, సీసీ కెమెరాలు, టాయిలెట్ తదితరాలు ఏర్పాటుకానున్నాయన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పుస్తక పఠనం చేస్తూ ప్రజలు సరికొత్త అనుభవం పొందేలా ఈ గ్రంథాలయంలో సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో కరోనా వ్యాప్తి లేదు

- ఆరోగ్య శాఖ డైరెక్టర్ వెల్లడి

అడయార్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తి లేదని అందువల్ల ప్రజలు భయాందోళనలకు చెందొద్దని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుడు సెల్వ వినాయగం పేర్కొన్నారు. 2022 తర్వాత ప్రభుత్వ చర్యల ఫలితంగా రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టామన్నారు. ప్రస్తుతం కరోనా వైరస్ వ్యాప్తి చాలా తక్కువగా ఉందన్నారు. ఒక వేళ ఎవరైనా వైరస్ బారినపడితే వారిలో కూడా పెద్దగా ఈ లక్షణాలు కనిపించడం లేదన్నారు. పైగా దేశంలో ఈ యేడాది కరోనా వైరస్ బారినపడి ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోలేదన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన నివేదికలో కూడా దక్షిణాసియా దేశాలైన భారత్, నేపాల్, బంగ్లాదేశ్, ఇండోనేసియా, థాయిలాండ్ తదితర దేశాల్లో కరోనా వ్యాప్తి అతి తక్కువగా ఉన్నట్టు పేర్కొంది. వియత్నాం, సింగపూర్, ఫిలిప్పీన్స్ వంటి దేశాల్లో ఈ వైరస్ వ్యాప్తి తగ్గినట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ వైరస్ వ్యాప్తి చాలా తక్కువగానే ఉందన్నారు. అదేసమయంలో మన రాష్ట్రంలో కూడా ఈ వైరస్ వ్యాప్తి గణనీయంగా తక్కువగా ఉందని, అందువల్ల ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ గీతా సమాజం స్వర్ణోత్సవాలు



మాతాజీని సత్కరిస్తున్న హైకోర్టు సీనియర్ న్యాయవాది జక్కుల హరికృష్ణ

చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): శ్రీ కృష్ణ గీతా సమాజం స్వర్ణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పాత చాకలిపేట శ్రీ కన్నికలమ్మ దేవస్థానంలో ఈనెల 4 నుంచి వేడుకలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఉదయం సాంస్కృతిక కార్యక్రమాలు, భగవద్గీత పోటీలు, పారాయణం, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ప్రవచనాలు జరుగుతున్నాయి. కార్యక్రమంలో తిరుపతి శ్రీ లలితా పీఠం వ్యవస్థాపకుడు స్వరూపానందగిరి ఈనెల 4 నుంచి 9వ తేది వరకు, ప్రొద్దుటూరు శివదర్శనానంద స్పిరుచ్యువల్ ట్రస్ట్ నిర్వాహకురాలు శివదర్శనానంద సరస్వతి మాతాజీ ఈనెల 10 నుంచి 15వ తేది వరకు, కర్నూలు శాఖ చిన్మయా మిషన్ సుప్రేమానంద సరస్వతి మాతాజీ ఈ నెల 16 నుంచి అభిభాషణ చేశారు. కార్యక్రమంలో భాగంగా ఈనెల 19వ తేది నిర్వహించిన ఎమ్మార్ సుబ్రమణ్యం, మదిరి రవికుమార్ భక్తి విభావరి జనరంజకంగా సాగింది. మంగళవారం సాయంత్రం శ్రీ మద్ భగవద్గీతలోని 17వ అధ్యాయంపై సరస్వతి మాతాజీ ప్రవచించారు. కార్యక్రమానికి సహకరించిన అందరికి సమాజం కార్యదర్శి, కోశాధికారి గులపల జగదీశ్వరయ్య, గులపల మనోహన్ తదితరులు ధన్యవాదాలు తెలిపారు.



భక్తి విభావరిలో మహిళలు

చెన్నైలో తగ్గిన భూగర్భ నీటి మట్టం!

- అయినా తాగునీటికి ఢోకా లేదంటున్న అధికారులు

వాషర్‌మెన్ పేట, మే 20 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల కాలంలో నగరంలోని పలు ప్రాంతాలలో భూగర్భ నీటి మట్టం తగ్గిందని, అయినప్పటికీ నిరంతరాయంగా తాగునీటి సరఫరా చేస్తామని చెన్నై వాటర్ బోర్డు అధికారులు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు భగ్గుమంటున్నాయి. ఫలితంగా జలాశాయాలలో నీటిమట్టం రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. మరోవైపు నగరంలోని అంబత్తూరు, మాదవరం తదితర ప్రాంతాల్లో గత మూడు నెలలగా పరీక్షించగా ఆ ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం 16 అడుగుల మేరకు తగ్గిపోయిందని జల వనరుల శాఖ అధికారులు వెల్లడించారు. అదేవిధంగా రాయపురం, వలసరవాక్కం, ఆలందూర్, పెరుంగుడి ప్రాంతాలలో 13 అడుగుల మేరకు భూగర్భ నీటి మట్టం తగ్గిపోయిందని వెల్లడించారు. గత ఏడాది రుతుపవన వర్షాలు ఆశాజనకంగా కురిసిన కారణంగా నగరంలోని అన్ని జోన్లలో భూగర్భ నీటిమట్టం ఊహించిన దానికంటే ఎక్కువగా నమోదైందని అధికారులు చెప్పారు. అయితే ఈ ఏడాది పరిస్థితి భిన్నంగా ఉందంటున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఎండలు విపరీతంగా ఉన్నాయని దీంతో ఇళ్లతో పాటూ వాణిజ్య సముదాయాలలో బోర్ల వినియోగం పెరిగిపోయి, భూగర్భ నీటిమట్టం తగ్గడానికి కారణమవుతోందన్నారు. ఇదిలా ఉండగా చెన్నైకి తాగునీటిని సరఫరా చేసే వాటర్ బోర్డు అధికారులు మాత్రం ప్రభుత్వం చేపట్టిన ముందు జాగ్రత్త చర్యల కారణంగా నీటి ఎద్దడి సమస్యను సమర్థవంతంగా ఎదుర్కో గలుగుతున్నామన్నారు. చెన్నైకు నీటిని సరఫరా చేసే 5 ప్రధాన జలాశయాలైన పూండి, పుళల్, చెంబరంబాక్కం, చోళవరం, కన్నన్‌కోట్టైలలో నీరు సంవృద్ధిగా ఉందని, వీటన్నింటిలో కలిపితే దాదాపు 7 టీఎంసిల నీరు నిల్వ ఉందన్నారు. ఇవికాకుండా, సముద్రపు నీటిని శుద్ధీకరణ చేసే కేంద్రాల ద్వారా, ప్రతి రోజు నగరానికి 350 మిల్లియన్ లీటర్ల తాగు నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. చెన్నై నగరానికి నెల రోజులకు టీఎంసీ మేర తాగు నీటి సరఫరా చేయాల్సి ఉంటుందని, ఇప్పటివరకూ ఎటువంటి ఢోకా లేకుండా నీటి సరఫరా కొనసాగుతోందని, మరో 7 నెలలకు తాగు నీటి సరఫరా గురించి దిగులు పడాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు.



నీటితో చెంబరంబాక్కం జలాశయం

తిరుమల పార్కులోకి దూసుకెళ్లిన కారు


ప్రమాదానికి గురైన కారు

● తప్పిన ప్రమాదం

తిరుమలలో మంగళవారం ఓ కారు అదుపుతప్పి పార్కులోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు ప్రమాదం తప్పింది. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం కుటుంబం ఎస్వీ గెస్ట్‌హౌస్ నుంచి ఎంటీసీ వైపుగా వెళుతున్నారు. ఈ క్రమంలో కారు అతివేగంగా పార్కులోకి దూసుకెళ్లింది. సుమారు 20 అడుగులు ముందుకెళ్లి ఇనుప కంచెను ఢీకొని నిలిచిపోయింది. కారులోని భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. బ్రేక్ బదులుగా ఎక్స్‌లేటర్‌ను తొక్కడంతోనే ప్రమాదం జరిగినట్టుగా తెలిసింది. కారు రోడ్డుపై కాకుండా పార్కులోకి వెళ్లడం, కొంతదూరం వెళ్లి ఆగిపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు..

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో రేపు హనుమజ్జయంతి వేడుకలు

ఏటా వైశాఖమాసం బహుళ దశమినాడు తిరుమల క్షేత్రంలో ఘనంగా నిర్వహించే హనుమజ్జయంతి వేడుకలు ఈనెల 22వ తేదీన టీటీడీ వైభవంగా నిర్వహించనుంది. శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయస్వామి, కాలినడకమార్గంలోని ఏడోమైలు ప్రసన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తిరుమలలోని జపాలితీర్థంలోనూ హనుమజ్జయంతి వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా సంప్రదాయానుసారం టీటీడీ తరపున జపాలి హనుమాన్‌కు పట్టువస్త్రాలు అందజేయనున్నారు. ఏడోమైలు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దీనికిగాను ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులు, స్థానికుల కోసం తిరుమల నుంచి ఏడోమైలు వరకు, తిరిగి తిరుమలకు చేరడానికి టీటీడీ ఉచిత రవాణా వసతి కల్పించనుంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


శ్రీవారి సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.52 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 79,003

తలనీలాలు సమర్పించినవారు: 33,140



చక్కటీ అనుబంధం

సరదాగా నలుగురు కలిసినా.. ఒత్తిడి అనిపించినా.. కాస్త తలనొప్పిగా ఉన్నా, సమయం, సందర్భం ఏదయినా టక్కున గుర్తొచ్చేది టీ. అంతెందుకు ఉదయం దినచర్య మొదలయ్యేది టీతోనే. ఇది తాగకుండా ఉండలేని వారెందరో మనలోనూ ఉన్నారు. సామాన్యుడి నుంచి ఉన్నత స్థాయి వరకూ టీకి ప్రాధాన్యమిస్తారు. మన ప్రధాని మోదీ చాయ్‌పే చర్చా పేరిట ప్రజలతో మమేకమవుతుంటారు. ఇలా టీ అందరి జీవితాలతోనూ ప్రత్యేక బంధాన్ని ఏర్పరచుకుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి





● నేడు ప్రపంచ టీ దినోత్సవం





ఈ కేఫ్ కేరాఫ్ మహిళలు

ఈసారి అంతర్జాతీయ టీ దినోత్సవంలో మహిళల పాత్రకు పీటవేయాలని నిర్ణయించారు. టీ ఉత్పత్తి, పంపిణీలో మహిళల పాత్ర, గుర్తింపు అనే కోణంలో ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలనేది థీమ్. మన తిరుపతిలో టీ మాస్టర్ నుంచి సప్లయర్ల వరకు మహిళలు నడిపే స్మార్ట్ కేఫ్‌లున్నాయి. యజమానులు కూడా మహిళలే. ఎంఆర్‌పల్లె, లక్ష్మీపురం సర్కిళ్లలో ఇలాంటి స్మార్ట్‌కేఫ్‌ల్లో సుమారు 20మంది మహిళలు పనిచేస్తున్నారు. అన్నిరకాల టీ, కాఫీలు ఇక్కడ అమ్ముతున్నారు. రుచి, నాణ్యతలో రాజీలేకుండా పోటీ మార్కెట్‌కు దీటుగా కేఫ్ నడుపుతున్నారు.

ఆరోగ్యానికి మంచిదేనండోయ్

టీ తాగడం వల్ల నాడీ సంబంధిత వ్యాధుల ముప్పు తగ్గుతుంది. మానసిక ఒత్తిడి స్థాయి తగ్గుతుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. భోజనం తర్వాత బ్లాక్ టీ రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తుందని తేలింది. జీర్ణక్రియకు సహాయపడుతుంది. రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. గుండె రక్షణకు సహకరిస్తుంది. టీలోని పాలీఫెనాల్స్ అనే ఆక్సిడెంట్లు దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. కొన్ని హెర్బల్ టీలు జీర్ణవ్యవస్థను కాపాడతాయి. సాంప్రదాయ టీలో కాఫీ కంటే తక్కువ కెఫిన్ ఉంటుంది. అల్లం టీ వంటి హెర్బల్ టీలు జీర్ణవ్యవస్థకు మంచివి. యాంటిస్పాస్మోడిక్‌గా పనిచేస్తాయి.

- డాక్టర్ కందారపు గీత, డైటీషియన్, స్విమ్స్

ఎన్ని రకాల టీలో..


తిరుపతిలో మహిళలు నిర్వహిస్తున్న కేఫ్

ఒకప్పుడు టీ అంటే తేయాకు ఒక్కటే. ఆధునిక కాలంలో, మారుతున్న అభిరుచులకు అనుగుణంగా టీలో చాలా రకాలు వచ్చాయి. తిరుపతి నగరంలోనూ ఎక్కువ రకాలు అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్య స్పృహ పెరిగి పంచదార వినియోగం తగ్గింది. అందుకే ఎక్కువ మంది బెల్లం.. అల్లం టీలపై ఆసక్తి చూపిస్తున్నారు. బ్లాక్ టీ, గ్రీన్ టీ, ఉలాంగ్ టీ, వైట్ టీ, పూ ఎయిర్ టీ, యెల్లో టీ అందుబాటులో ఉన్నాయి. బ్లాక్, గ్రీన్, హెర్బల్ టీలు ఎవరికి వారే ఇంట్లో తయారు చేసుకుంటున్నారు. ఇన్‌స్టంట్ ప్యాకెట్లను కొనుక్కొని వేడినీళ్లలో వేస్తే ఇట్టే రెడీ అయిపోతున్నాయి. జిల్లాలో చాలాచోట్ల ప్రత్యేకించి తాటిబెల్లం టీలను కూడా అమ్ముతున్నారు.

■ శ్రీవారి సేవలో ప్రముఖులు


జస్టిస్ జయచంద్రన్


మానస వారణాశి

సినీనటి, మిస్ ఇండియా-2020 మానస వారణాశి మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ సిబ్బంది ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయచంద్రన్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

డామిట్.. కథ అడ్డం తిరిగింది

● జేమ్స్‌పై దాడిచేసింది వైసీపీ బ్యాచే ● బెడిసికొట్టిన పన్నాగం

తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇంజనీరింగ్ విద్యార్థుల మధ్య జరిగిన గొడవను రాజకీయం చేసిన వైసీపీ బ్యాచ్ పన్నాగం బెడిసికొట్టింది. చచ్చేలా కొట్టి మూత్రం తాగించారని ఫిర్యాదు చేసిన ఇంజనీరింగ్ విద్యార్థి జేమ్స్ వ్యవహారాన్ని వైసీపీ రాజకీయ లబ్ధి కోసం వాడుకునే ప్రయత్నం చేసింది. వ్యక్తిగత గొడవను కూటమిపై రుద్ది పబ్బం గడుపుకోవాలని చూసింది. దళితులను రెచ్చగొట్టేలా ఆ పార్టీ పత్రిక ద్వారా విషం చిమ్మింది. అయితే దాడి చేసింది వైసీపీ పెద్దల అనుచరులేనని తేలడంతో 'డామిట్..కథ అడ్డం తిరిగింది' అని నాలుక్కరుచుకుంది. ఈనెల 15వ తేది అర్ధరాత్రి తిరుపతిలో జేమ్స్ అనే దళిత విద్యార్థిని కిడ్నాప్ చేసి, దాడిచేసిన ఘటనకు సంబంధించి ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు యశ్వంత్, కిరణ్, జగ్గ, లలిత్, సాయిగౌడ్, వంశీ, రూపేష్ ఇంకా మరికొంత మంది నిందితులుగా కేసు నమోదైంది. నిందితుల్లో జగదీష్ అలియాస్ జగ్గ, లలిత్, గోపాల్, నాని, సాయి గౌడ్ వైసీపీ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అనుచరులుగా తెలిసింది. రూపేష్ అలియాస్ రూపి, సాయికిరణ్‌కుమార్ రెడ్డి తిరుపతి వైసీపీ ఇన్‌చార్జి భూమన అభినయ్ అనుచరులు కాగా, వంశీ అలియాస్ చోట బ్లేడ్ ఎంపీ గురుమూర్తి అనుచరుడిగా తెలుస్తోంది. ఇంకా మరికొంతమంది నిందితులపై కేసు నమోదు చేశారు. వైసీపీలో పైస్థాయి నుంచి వారిని అనుచరగణం వరకు నేరపూరితధోరణిలో ఉంటారనడానికి ఇలాంటి ఘటనలే నిదర్శనమని కూటమి నాయకులు మండిపడుతున్నారు. ప్రతిపక్షంలో కూడా వైసీపీ తన సహజవైఖరిని విడిచిపెట్టడంలేదని అంటున్నారు.

జేమ్స్ కిడ్నాప్ కేసులో దర్యాప్తు ముమ్మరం

తిరుపతి(నేరవిభాగం),మే20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇంజనీరింగ్ విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసిన ఘటనలో దర్యాప్తు ముమ్మరం చేశారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, పోలీసులు కలసి బాధితుడి స్వగ్రామం నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రెడ్డిపాలేనికి మంగళవారం వెళ్లి విచారించారు. ఘటనకు దారి తీసిన కారణాలపై ఆరా తీశారు. అతడి నుంచి రాతపూర్వకంగా స్టేట్‌మెంటు రికార్డు చేశారు. ఇప్పటి వరకు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు తాజాగా మంగళవారం బెంగళూరులో మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని తిరుపతికి తీసుకొస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

● టీడీపీ మహానాడు కమిటీల్లో ఉమ్మడి జిల్లా నుంచీ 16 మందికి చోటు

అనగాని, దగ్గుమళ్ల, పులివర్తి, పంతగాని, అమర్, అనిమినికి కీలక బాధ్యతలు

మరికొందరికి కమిటీల్లో సభ్యత్వం

తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహణకు ఏర్పాటు చేసిన కమిటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన 16 మంది నేతలకు చోటు దక్కింది. వీరిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సమన్వయ కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. మంత్రి అనగానికి పార్టీ అదనంగా ఆర్థిక వనరుల కమిటీకి కన్వీనర్‌గా, భోజనాల ఏర్పాట్ల కమిటీ కో కన్వీనర్‌గా కీలక బాధ్యతలను అప్పగించింది. అలాగే, అమరనాథరెడ్డికి జనసమీకరణ కమిటీ కో కన్వీనర్‌గా అదనపు బాధ్యతలు కేటాయించింది. మహానాడు సభ అలంకరణ కమిటీ కన్వీనర్‌గా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీకి ముఖ్యమైన బాధ్యత అప్పగించారు. వలంటీర్ల నిర్వహణ కమిటీకి శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు కో కన్వీనర్‌గా నియమితులయ్యారు. టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ మహానాడులో సాంస్కృతిక కార్యక్రమాల కమిటీకి కో కన్వీనర్ బాధ్యతలు తలకెత్తుకున్నారు.

పలు కమిటీల్లో మరికొందరికి సభ్యత్వం

జనసమీకరణ కమిటీ సభ్యుడిగా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి, తీర్మానాల కమిటీలో ఏపీ బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, వసతి ఏర్పాట్ల కమిటీలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ కుమారుడు పులివర్తి వినీల్ సభ్యులుగా నియమితులయ్యారు. పత్రికా, మీడియా, సోషల్ మీడియా కమిటీ సభ్యులుగా తిరుపతికి చెందిన టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, నీలాయపాలెం విజయ్‌కుమార్‌ను పార్టీ నియమించింది. సభా ప్రాంగణ పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే పులివర్తి నానీకి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం టీడీపీ ఇన్‌చార్జి, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం రవాణా కమిటీలోను, జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.వి.థామస్ రక్తదానం, మెడికల్ క్యాంపు కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. వలంటీర్ల నిర్వహణ కమిటీ సభ్యులుగా పీలేరుకు చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్, మదనపల్లెకు చెందిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, తిరుపతి పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీపతి బాబు సభ్యులుగా నియమితులయ్యారు. ఇలా.. ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సహా మొత్తం 16 మందికి మహానాడులో వేర్వేరు బాధ్యతలను పార్టీ అప్పగించింది.

మలుపు తిరిగిన మిస్సింగ్ కేసు

- కంచిలో బాలుడి మృతి?
- అక్కడే పాతిపెట్టేసిన యజమాని
- మృతదేహం కోసం గాలిస్తున్న పోలీసు బృందాలు


వెంకటేశులు (ఫైల్)

సత్యవేడు, మే 20 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలంలో సోమవారం వెలుగుచూసిన గిరిజన బాలుడు వెంకటేశులు అదృశ్యం కేసు మలుపు తిరిగింది. గూడూరు మండలం చవటపాళెం గ్రామానికి చెందిన చెంచయ్య భార్య అంకమ్మ తాను చేసిన అప్పు కోసం తన తొమ్మిదేళ్ల కుమారుడు వెంకటేశులును బాతులు మేపేందుకు సత్యవేడు పట్టణం దళవాయి అగ్రహారానికి చెందిన వ్యాపారి వద్ద పది నెలల క్రితం పనిలో పెట్టారు. తన కుమారుడు కనిపించకపోవడంతో పలుమార్లు ఆమె ఆ వ్యాపారిని అడిగినా సరైన సమాధానం రాకపోవడంతో అతడిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు యజమాని, ఆయన కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు వెట్టిచాకిరి కేసులను నమోదు చేశారు. వారిని అదుపులో తీసుకుని విచారించగా బాలుడు అదృశ్యంపై సంచలన విషయాలు బయటకు వచ్చినట్లు తెలిసింది. బాతులు మేపేక్రమంలో నెల రోజుల క్రితం బాతుల వ్యాపారి ముత్తు బాలుడు వెంకటేశులును కంచి పరిసర ప్రాంతాలకు తీసుకెళ్లారు. అక్కడ ఆ బాలుడు అనారోగ్యానికి గురై మృత్యువాత పడినట్లు తెలిసింది. దీంతో బాలుడి మృతదేహాన్ని తల్లికి అప్పగించకుండా కంచి పరిసర ప్రాంతంలోనే ముత్తు పాతిపెట్టినట్లు సమాచారం. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో మూడు పోలీసు బృందాలు మంగళవారం కంచికి చేరుకుని, తమిళనాడు పోలీసుల సాయంతో బాలుడి మృతదేహం కోసం గాలిస్తున్నట్లు తెలిసింది. బాలుడు మృతిచెంది ఇరవై రోజులకు పైగా అయినట్లు సమాచారం. కంచిలో బుధవారం బాలుడి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిసింది.

ఉపాధ్యాయులకు నేడు రుయాలో ప్రత్యేక మెడికల్ క్యాంప్

● ఈ ధ్రువీకరణ పత్రాల ద్వారానే బదిలీలు: డీఈవో

తిరుపతి(విద్య), మే 20 (ఆంధ్రజ్యోతి): స్టేట్ టీచర్స్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ యాక్ట్- 2025 ప్రకారం రీఅప్పోర్షన్‌కు గురైై ప్రిఫరెన్షియల్ కేటగిరీకి ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేందుకు బుధవారం తిరుపతి రుయాస్పత్రిలో ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసినట్టు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు మెడికల్ క్యాంప్ ప్రారంభమవుతుందని, బదిలీలకు ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద పత్రాలు పొందాలనుకున్న ఉపాధ్యాయులు హాజరు కావాలని సూచించారు. ప్రస్తుత చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ క్యాంప్ ద్వారా పొందిన సర్టిఫికెట్ల ఆధారంగా మాత్రమే ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ వర్తింపజేస్తారని డీఈవో స్పష్టం చేశారు.

ఐసెట్‌లో 2627 మంది పాస్

● ఇద్దరికి రాష్ట్రస్థాయి ర్యాంకులు


రాష్ట్రస్థాయి 7, 10 ర్యాంకులు సాధించిన అజయ్‌కుమార్, మహేంద్రసాయి

తిరుపతి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీఐసెట్ ఫలితాలను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. జిల్లాలో 2759 మంది పరీక్ష రాయగా 2627 మంది ఉత్తీర్ణులయ్యారు. 1350 మంది పురుషులకు 1296 మంది.. 1409 మంది మహిళలకు 1331 మంది పాసయ్యారు. తిరుపతికి(వేదాంతపురం) చెందిన వలిపి అజయ్‌కుమార్ 174.17 మార్కులతో రాష్ట్రస్థాయిలో 7వ.. సూళ్లూరుపేట సమీపం మన్నారుపోలూరుకు చెందిన చామ మహేంద్రసాయి 171.91 మార్కులతో రాష్ట్రస్థాయి 10వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. ఎస్వీయూ పరిధిలో 12804 మంది పరీక్ష రాయగా 12096మంది అర్హత సాధించారు. వీరిలో 6295మంది పురుషులకిగాను 5947మంది క్వాలిఫై కాగా 6509మంది మహిళలకి గాను 6149 మంది అర్హత సాధించినట్లు ఐసెట్ నిర్వాహకులు ప్రకటించారు. 'హైదరాబాద్‌కి చెందిన డెలాయిట్‌సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నా. యూపీఎస్సీకి ప్రిపేర్ అవుతూనే పలు పోటీపరీక్షలు రాస్తున్నా. దీనిలో భాగంగానే ఏపీఐసెట్‌ని రాశా. సివిల్‌సర్వీసెస్/గ్రూప్‌వన్ ఆఫీసర్ ఉద్యోగం సాధించాలన్నది నా జీవితాశయం'అని అజయ్‌కుమార్ తెలిపారు. 'ఆంధ్రాయూనివర్సిటీలో 2024లో బీటెక్(ఇన్‌స్ట్రుమెంటేషన్)పూర్తి చేశా. క్యాట్ పరీక్షకి ప్రిపేర్‌అవుతూనే ఐసెట్ రాశా. ఉన్నతస్థాయి ఉద్యోగంలో స్థిరపడాలన్నది నా లక్ష్యం' అని మహేంద్రసాయి పేర్కొన్నారు.

పీఎంఏజీవై కింద 171 గ్రామాలు ఎంపిక

తిరుపతి(కలెక్టరేట్), మే 20(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆదర్శగ్రామ యోజన (పీఎంఏజీవై) కింద జిల్లాలో 171 గ్రామాలను ఎంపిక చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. షెడ్యూల్ కులాల ఆధిక్యం కలిగిన గ్రామాల్లో సమగ్రాభివృద్ధి చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా కనీసం 40 శాతం ఎస్సీ జనాభా ఉన్న గ్రామాలు, 500 జనాభా ఉన్న గ్రామాలకు (2011 జనగణన ఆధారంగా) ప్రాధాన్యమిస్తారని తెలిపారు. పీఎంఏజీవై ద్వారా పల్లెలు ఆదర్శ గ్రామాలుగా రూపాంతరం చెందాలనే నినాదంతో పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పీఎంఏజీవై పథకం నోడల్ అధికారి డీడీ, నెల్లూరు, చిత్తూరు జడ్పీ సీఈవోలు, డ్వామా పీడీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి కలెక్టర్ జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, రెవెన్యూ డివిజన్, మండల అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను అలసత్వం, రీఓపెన్‌కు తావులేకుండా పరిష్కరించాలన్నారు. వారికి సంతృప్త పరిష్కారం చూపాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి సోమవారం మండల, డివిజన్ పరిధిలో తప్పనిసరిగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ, నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

జిల్లాలో చేపడుతున్న జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించి పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళికబద్ధంగా, వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి వర్చువల్ విధానంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రేణిగుంట నుంచి చెన్నై రహదారుల పనులు పూర్తిచేయాలని, భూసేకరణకు సంబంధించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్యాకేజీ 2, 3, 4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టి, ఆర్డీవోలు నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుని నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పీడీలు, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఆర్డీవోలు, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయభరత్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

25న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు

● ఏర్పాట్లు పక్కాగా ఉండాలి: కలెక్టర్

జిల్లాలో ఈ నెల 25న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు-2025కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో నరసింహులతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ పరీక్షలకు తిరుపతి జిల్లాలో 13 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 5,261 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచ్‌లు, హెడ్‌సెట్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సకాలంలో అభ్యర్థులు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.